క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు చేశారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

పరవాడ: దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 101 జయంతిని పరవాడలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ నాయకుడు బి.అప్పలనాయుడు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



ఆంజనేయస్వామి

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 30నుంచి వచ్చే నెల 1వరకు హనుమజ్జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. 30న ఉదయం 8 నుంచి గణపతిపూజ, పుణ్యాహవచనం, సుందరకాండ పారాయణ, 31న ఉదయం 7 గంటలకు స్వామికి అభిషేకం, సహస్రనామార్చన, సుందరకాండ పారాయణ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 6.30గంటలకు పంచామృతాభిషేకం, 7గంటలకు సహస్రనామార్చన, 9గంటల నుంచి శ్రీరామ పట్టాభిషేక సర్గపారాయణ, 9.30గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులంతా పూజల్లో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.


హారన్ల మోతపై కఠిన చర్యలు



పెద్ద హారన్లతో నడుపుతున్న బుల్లెట్లను స్వాధీనం చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం: తీవ్రమైన శబ్దం వచ్చే సైలెన్సర్లు ఏర్పాటు చేసుకుని, హారన్లు మోగిస్తూ తిరుగుతున్న బుల్లెట్ వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్దిలపాలెం కూడలి వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లను ఏర్పాటు చేసుకుని ప్రయాణిస్తున్న ముగ్గురు ద్విచక్ర వాహనచోదకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.కనకరాజు మాట్లాడుతూ వాహన చోదకులు శబ్ద కాలుష్యంతో కూడిన వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్‌ను వినియోగించడం తగదన్నారు.

వైభవంగా పరదేశమ్మ అనుపు మహోత్సవం



పరదేశమ్మ

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారంలో కొలువైన పరదేశమ్మ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు కుంకుమలు,చీరలు అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ,మజ్జిగ పంపిణీ చేశారు.అమ్మవారి సన్నిధిలో రాత్రికి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి.రాత్రికి అమ్మవారి అనుపు మహోత్సవం వైభవంగా నిర్వహించారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు



పరవాడ-భర్నికం రహదారిలో సంచరిస్తున్న వీధి కుక్కలు



ముత్యాలమ్మపాలెం బీచ్‌లో గ్రామ సింహాలు

పరవాడ: వీధి కుక్కలు పల్లె ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా దాడి చేసి స్థానికులతో పాటు వాహన చోదకులను గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా మత్స్యకారులు నివసిస్తున్న ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల్లో వీధి కుక్కల బెడద మరింతగా అధికంగా ఉంది. గంగపుత్రులతో పాటు తీర ప్రాంతాలకు రాకపోకలు సాగించే పర్యాటకులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన పరవాడలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రయాణికులతో పాటు ప్రజలను భయపెడుతున్నాయి. ఇక్కడ వారపు సంతలో మిగిలిపోయిన మాంసం, చేపల వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు తమ సంతానాన్ని రోజు రోజుకూ వృద్ధి చేస్తున్నాయి. కుక్క కాట్లకు గురై రోజూ ఒకరిద్దరు ఆస్పత్రి పాలవుతున్నా అధికారుల్లో కనీస చలనం లేదని ప్రజలు వాపోతున్నారు. దేశపాత్రునిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, రావాడ, తానాం, పెదముషిడివాడ, గొర్లివానిపాలెం, వెన్నలపాలెం, కలపాక, పి.బోనంగి, ఈ.బోనంగి గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అలరించిన సంగీత విభావరి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

అల్లిపురం: నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. ఊహల గుసగుసలాడే శీర్షికన శ్రీదేవీ మహానటి సంస్థ నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయకులు ఎంఎస్ మాధవ్ పాడిన ఎదురీతకు అంతం లేదా, మద్దిల అప్పారావు, రమణి పాడిన ఈ మూగ చూపేలా.. సుధీర్, రమణి పాడిన కోటలోని మొనగాడా వంటి గీతాలు శ్రవణానందం కలిగించాయి. కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, సంఘ సేవకులు, సంస్థ కార్యదర్శి విజయరమణి, కోశాధికారి రమణి, గౌరవాధ్యక్షురాలు కందర్ప రాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అమ్మాజీ రావు, అప్పారావు, డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.

కుటుంబ వ్యవస్థకు రామాయణమే మూలం



మాట్లాడుతున్న రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట : భారతీయ కుటుంబ వ్యవస్థ.. రామాయణం అనే అంశంపై మంగళవారం ప్రసంగ కార్యక్రమం జరిగింది. భారతీయ శిక్షణ్ మండల్ నిర్వహణలో స్థానిక బీవీకే కళాశాలలో చెరుకూరి సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత డాక్టర్ డి.వి.సూర్యారావు ప్రధాన వక్తగా మాట్లాడారు. మన కుటుంబ వ్యవస్థ సమాజానికి బలమైన ప్రాకారమని, ప్రపంచంలో ఎక్కడా ఇటువంటి వ్యవస్థ లేదని తెలిపారు. కాలక్రమంలో ఇక్కడ కూడా అనుబంధాలు పతనమవుతున్నాయన్నారు. రామాయణం ప్రాచీన కుటుంబ వ్యవస్థకు మూలమని తెలిపారు. రామాయణంలోని అన్నదమ్ముల అనుబంధం సమాజానికి ఆదర్శమని, అయోధ్య, లంక, కిష్కింధల్లో భిన్న సంస్కృతులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కొత్తూరు రమణ పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ సత్యనారాయణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయంలో అంతా సహనంతో ఉండాలని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు దిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాడి గ్రామంలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఇరు వర్గాలు ఎటువంటి తగాదాలు పడవద్దన్నారు. అంతా సోదర భావంతో మెలగాలని సూచించారు. పోటీల్లో ఎవరో ఒకరు గెలవడం సహజం అన్న విషయాన్ని గ్రహించి అంతా సోదరుల్లా మెలగాలన్నారు. సదస్సులో పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు, సిబ్బంది పాల్గొన్నారు.


వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు దివాకర్

మర్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానాస్పద రీతిలో మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. దీనిపై పోలీసులందించిన వివరాలిలా.. రామ్మూర్తిపంతులుపేట (ఆర్పీపేట) పవర్ స్టేషన్ పక్కన ఉన్న పార్కు వద్ద ఆటోలో మంగళవారం బోర దివాకర్ అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సదరు మృతుడు కొంతకాలంగా భార్యకు దూరంగా ఉంటున్నాడు. అలాగే తల్లి దగ్గర కొంతకాలం ఉన్నాడు. తర్వాత విభేదాలు రావడంతో వారికి కూడా దూరంగా ఉంటూ బయట గడుపుతున్నాడు. ఇతడికి మద్యం సేవించే అలవాటు ఉంది. మద్యం ఎక్కువ సేవించడం వల్ల మృతి చెందాడా, ఆహారం లేక మరణించాడా, మరే ఇతర కారణాల వల్ల మృతి చెందాడా అన్న విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

'ఎల్‌హెచ్‌ఎంఎస్'తో రక్షణ పొందండి



క్వార్టర్‌లో ఎల్‌హెచ్‌ఎంఎస్ అనుసంధాన సీసీ కెమెరా అమర్చుతున్న క్రైం పోలీసులు

ఉక్కునగరం: ఊరెళ్తున్నారా లాక్డ్ హౌస్ మానటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)తో రక్షణ పొందండని క్రైం పోలీసులు భరోసా ఇస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-11కు చెందిన ఉద్యోగి తన కుటుంబ సభ్యులతో ఊరెళ్తూ స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సౌత్ క్రైం ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్‌ఐ టి. రుక్మాంగదరావు నేతృత్వంలో ఆ క్వార్టర్‌కు వచ్చి సీసీ కెమెరాను అమర్చారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్మార్ట్‌ఫోన్‌లోని గూగుల్ ప్లే స్టోర్ తెరిచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ఇంట్లోని వ్యక్తులు పూర్తి వివరాలను పొందుపరిస్తే పోలీసులే మీ ఇంటికి వచ్చి సీసీ కెమెరాలను అమర్చుతారన్నారు. సీసీ కెమెరాను పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించడం ద్వారా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారని, సంబంధిత ఇళ్లలో అనుమానస్పద వ్యక్తులు ప్రవేశిస్తే కంట్రోల్ రూమ్‌లో అలారం కూడా మోగుతుందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. తద్వారా దొంగల్ని పట్టుకునే అవకాశముందన్నారు. అదే విధంగా నగర ప్రజలు కూడా సీసీ కెమెరాలను అన్ని చోట్లా అమర్చుకుంటే నేరాలను అరికట్టవచ్చని ఆయన తెలిపారు.

ఐఎన్‌టీయూసీతోనే కార్మికుల సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని కమ్యూనిస్టు కార్మిక సంఘాలతో కార్మికులు విసుగు చెందారని, అందులో భాగంగా అనేక మంది ఐఎన్‌టీయూసీలో చేరుతున్నారని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. మంగళవారం సెంట్రల్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద ఎస్టీఎం విభాగం మహిళా ఉద్యోగి రత్నశ్రీ ఐఎన్‌టీయూసీలో చేరారు. ఆమెకు రాజశేఖర్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించగలిగే సత్తా ఐఎన్‌టీయూసీకి మాత్రమే ఉందన్నారు. రత్నశ్రీ మాట్లాడుతూ కార్మికులకు వేతన ఒప్పందం, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయగలిగే సత్తా ఐఎన్‌టీయూసీ ఉందని భావించి ఆ యూనియన్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, ప్రభాకరరెడ్డి, ఎస్.ఎ.నాయుడు, గోపాలరాజు, కొమ్ము ప్రసాద్, డి.మోహన్, రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రవణ నక్షత్ర హోమం

సింహాచలం: శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కొండదిగువ ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30గంటల నుంచి విశేష హోమం నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. భక్తులంతా కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

చురుగ్గా విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు



విభిన్న ప్రతిభావంతుడితో ఎంఈవోలు లక్ష్మణరావు, మూర్తి తదితరులు

సబ్బవరం: విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎస్. లక్ష్మణరావు అన్నారు. మండలంలో విభిన్న ప్రతిభావంతుల గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 1న ప్రారంభించిన సర్వే వచ్చేనెల 9వ తేదీ వరకూ నిర్వహించామని చెప్పారు. సబ్బవరంలోని గోపాల్‌నగర్ పరిసర ప్రాంతంలో వినికిడి లోపం గల విద్యార్థిని గుర్తించామన్నారు.ఈ విభిన్న ప్రతిభావంతులకు రవాణా భత్యం తదితర సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. సర్వేలో ఇప్పటి వరకూ 14 మందిని గుర్తించామన్నారు. వారిని సమీపంలో ఉన్న పాఠశాలలో నమోదు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి, బి. సింహాద్రప్పడు,ఎస్. బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జితసేవలు



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉన్న పచ్చిరొట్ట ఎరువులు

సబ్బవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన జనుము 15 క్వింటాళ్లు, జీలుగ 8 క్వింటాళ్లు , పిల్లి పెసర 8 క్వింటాళ్లు విత్తనాలను సిద్ధంగా ఉంచామన్నారు.జనుము 10 కేజీల విత్తనాలు 50 శాతం రాయితీ పోను రూ. 440, పిల్లి పెసర విత్తనాలు 8 కేజీలు రాయితీ పోనూ రూ.536 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పచ్చిరొట్ట ఎరువులను ఎకరాకు 12 నుంచి 16 కేజీలు భూమిలో వేసుకొని 40 నుంచి 45 రోజుల తర్వాత అంటే పూత దశ లో భూమిలో కలియ దున్నడం ద్వారా సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని చెప్పారు.దీనివల్ల రసాయనక ఎరువుల వినియోగం తగ్గడమే కాకుండా నాణ్యమైన ఉత్పత్తులను పండించవచ్చన్నారు. అదే విధంగా రైతులకు అవసరమైన వరి విత్తనాలు కొరకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏవో తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానం



సమావేశంలో మాట్లాడుతున్న చిన్మయిదేవి

ఎంవీపీ కాలనీ: జిల్లా స్థాయి రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని మంగళవారం ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవాన్ని ఏటా మే 28న నిర్వహిస్తుందన్నారు. రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత ప్రధానమన్నారు. ఆ సమయంలో మహిళల్లోని అపోహాలు, అభద్రత భావాన్ని తొలగించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ అంశంపై బాలికల్లో అవగాహన పెంచేందుకు పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలన్నారు. రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించకపోవడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆ సమయంలో బాలికలు, మహిళలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు బలమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారత అధికారి కార్యాలయం ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ సౌరభం

1966లో దొండపర్తిలోని నెహ్రూబజార్ సమీపంలో స్థాపించిన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం తదనంతర కాలంలో ఆ పక్కనే ఉన్న పాఠశాల మేడ మీదకు మార్చారు. ఈ గ్రంథాలయంలో నవలలు, చిన్న పిల్లలు ఇష్టపడే కథల పుస్తకాలు, కామిక్స్, పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు అవసరమయ్యే సైన్స్, మ్యాథ్స్ వంటి అనేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వేసవిలో చిన్నారులకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు, నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించి.. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తున్నారు.



గ్రంథాలయంలో పాఠకులు

- చక్కటి సేవలందిస్తున్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం
- పాఠకులకు అందుబాటులో 80 వేల పుస్తకాలు
- పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ప్రాధాన్యం



నెహ్రూబజార్‌లోని ప్రాంతీయ గ్రంథాలయం



గ్రంథాలయకర్త పద్మావతీదేవి

సీతమ్మధార: దొండపర్తిలో ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయం సాహితీ సౌరభాలు వెదజల్లుతోంది. 1966లో ఈ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఇక్కడ దాదాపు 80 వేల వరకు వివిధ రకాల పుస్తకాలున్నాయి. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగపడే అనేక పుస్తకాలను ఇక్కడ పొందుపరిచారు. అలాగే పాఠకులు ఇష్టపడే నవలలు, పిల్లలకు నచ్చే కామిక్స్, రంగు రంగుల కథల పుస్తకాలు ఇక్కడున్నాయి. అలాగే రాజకీయ శాస్త్రం, ఇంజినీరింగ్, న్యాయశాస్త్రం, పలువురు ప్రముఖుల జీవిత చరిత్రలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. తెలుగు అకాడమీ పుస్తకాలు, హిందీ చదువరుల కోసం పలు రకాల గ్రంథాలు ఇక్కడ కొలువుదీరి ఉన్నాయి. ఈ గ్రంథాలయం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తుంది. రోజూ ఇక్కడికి వందకు పైగా విద్యార్థులు, పాఠకులు వస్తుంటారు. గ్రంథాలయ కర్తలు పైడిరాజు, వీపీ పద్మావతిదేవి పర్యవేక్షణలో సిబ్బంది ఇక్కడ సేవలు అందిస్తున్నారు. ప్రతి గురువారం, రెండో శనివారం సెలవు దినంగా పాటిస్తున్నారు. ఈ గ్రంథాలయంలో ఏడు వేల మంది సభ్యత్వం కలిగి వున్నారు.

వేసవి శిక్షణ శిబిరం..

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు ఇక్కడ రోజూ ఉదయం పూట స్పోకెన్ ఇంగ్లీష్, కథా పఠనం, పాటల వంటి అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. జూన్ 7వ తేదీన జరిగే ముగింపు ఉత్సవంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. పాండిచ్చేరి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన విజయలక్ష్మి ఈ గ్రంథాలయానికి 160 పుస్తకాలు విరాళంగా అందజేశారు. జేడీ ఫౌండేషన్ యాజమాన్యం మూడు టేబుళ్లు, 20 కుర్చీలు, మూడు ఫ్యాన్లు, నాలుగు ట్యూబ్ లైట్లు విరాళంగా అందించారు. ఇక్కడ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయిన దాదాపు 30 మంది యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ ఏటా నవంబర్‌లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తుంటారు.

భోజనం రుచిగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో చంద్రకళ

కొమ్మాది: ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనం రుచిగా ఉండేలా చూసుకోవాలని డీఈవో ఎల్. చంద్రకళ అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల లెవిల్ మధ్యాహ్న భోజన పథకంపై శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రతి రోజూ వంట మెనూ ప్రకారం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన కుక్ కమ్ హెల్పర్స్‌తో వంటకాల తయారీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో తోటగరువు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రథమ బహుమతి సాధించగా, ద్వితీయ బహుమతి గాంధీనగర్ ఎంపీపీ స్కూల్ నిర్వాహకులు ఎంపికయ్యారు. వీరికి డీఈవో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీఎం కో ఆర్డినేటర్ ఎస్. జె శాస్త్రి, ఎంఈవోలు సీహెచ్ రవీంద్రబాబు, పి.అనురాధ పాల్గొన్నారు.